# చేను పక్క చేను

అంబటి ప్రొద్దయింది.

ఆదరా బాదరా నాలుగు మెతుకులు నంజి, కంచంలో చేతులు కడుక్కొని పీటమీదనుంచి లేచాడు గోపయ్య. దండేన వున్న నీర్కావి పై పంచను తీసికొని, వల్లెవాటుగా వేసికొని, వసారా చూరులోని ముల్లుగర్ర తీసికొని, ముతకచెప్పులు తొడుక్కొని ముంచారగుంట పొలంకేసి బయల్దేరాడు.

"మద్దినేల ఇంటికి రావా ?" అన్నది సరస్వతమ్మ వరండా గడపదగ్గర గుమ్మటంగా నిలబడి.

"దేనికి ?" అన్నాడు గోపయ్య గొంతు పెద్దదిచేసి.

"ఏంలేదు ! పులిబొంగరాలకు పిండి నానబోశాను," అన్నది సరస్వతమ్మ.

మారు మాట్లాడకుండా ముందుకు నడిచాడు గోపయ్య.

కొత్తకారంలాగ ఎండ కరకరలాడుతోంది. ఆయన మనస్సంతా అదోరకంగా ఉంది — ముసురులో కుంపట్లాగా. నిన్న కడసంజవేళ ముంచారగుంటదగ్గరున్న ఎకరన్నరపొలంలో అమ్మోనియా ఎరువులు వేసి వచ్చాడు. ఆ ఎరువులు కొనడానికి డబ్బులేక షావుకారు చెంగయ్యనాయుడివద్ద రూపాయిన్నర వడ్డీకి నోటు రాసి రెండొందలు అప్పు తేవాల్సివచ్చింది. ఎర్ర బారిన చేను ఈ ఎరువుల బలంతో బాగా పుంజుకుంటుంది. నల్లగా నిగనిగలాడుతూ వస్తుంది. నిరుటికంటె ఎక్కువ రాలు

బడి నిస్తుంది. పాతఅప్పులు తీరిపోతాయి. పెద్దపిల్లకు పెళ్ళి చేయొచ్చు... కాని తన చేనుకు పెట్టిన బలం తన చేనుకే వంట బడుతుందా ? ... వంటబట్ట కేమౌతుంది ? ఆశీర్వాదంగాడు ఏ అఘాయిత్యానికి పాల్పడకుండా వుంటాడా ? ... ఆ ఊహ రాగానే గోపయ్యగుండె గుబగుబలాడింది. శరీరం ముచ్చెమట్లతో మునిగి తేలింది.

ఒకటోనెంబరు బ్రాంచి కెనాల్ కట్టనుంచి డొంక పుచ్చుకున్నాడు. గబగబా నడువసాగాడు. అయిదు నిమిషాలలో చేనుదగ్గరకు చేరుకున్నాడు.

ఆ చేనుకేసి చూడగానే గోపయ్యకు నవనాడులూ క్రుంగిపోయాయి. దూడబోయిన ఆవులా చేనంతా బావురుమంటోంది. నిన్నటి సాయంకాలంవేళ చేలో భర్తీగా నీళ్ళున్నాయి. ఆ నీళ్ళల్లో ఎరువు వేశాడు. ఆ ఎరువుసారాన్ని చేలోని వరి మొక్కలు యినుమిక్కిలిగా పీల్చేసుంటా యనుకున్నాడు. ఆ సారంతో మొక్కలు బలమైన దుబ్బుకట్టి, జాయిగా పెరిగి, వెన్నుదన్నేట్టుగా కంకులు వేస్తాయనుకున్నాడు. కాని ఇప్పుడా ఆశలన్నీ అడుగంటాయి. చేలో నీళ్ళులేవు. చేలో వేసిన ఎరువు లేదు. ఆ నీళ్ళూ, ఆ ఎరువులసారమూ - పక్కచేలోకి పారిపోయి దాక్కున్నాయి.

... ఇదంతా ఆశీర్వాదంగాడి దుర్మార్గమే ! వాడే ఈ దారుణానికి పాల్పడి వుంటాడు. నిన్న తను ఎరువులు చల్లి, ఇంటికి వెళుతూంటే డొంకలో ఎదురుపడ్డాడు-చౌదరయ్యగారి పసుపుదోట దగ్గిర. ఆమైన చేనుకాడి కెళ్ళి ఈ కానిపని చేసి వుంటాడు. వాడి చేనులో నిన్న సాయంకాలం నీళ్ళు లేవు. ఇవ్వాళటిరోజు నీటితో నిండివుంది గట్టు తెంచి నీళ్ళు పెట్టి

వుంటాడు. ఛీ. ఛీ ... యేం బ్రతుకు ? యీ దొంగబ్రతుకెన్నాళ్ళు బ్రతుకుతాడు ? దుర్మార్గుడి కెప్పుడూ మంచిరోజులే ఉంటాయా ? తన చేనుపక్కన వాడు చేరినప్పుడే పెద్ద అనర్థం చుట్టుకుంది. అసలు మున్సబుకు మతిలేదు. ఆ చేను వాడికి కౌలు కెందు కివ్వాలి ? ... ఇదంతా తన తలరాత. తన చెవి కింద పురుగులా చేరాడు. ఇప్పుడు త నేం చేయాలి ? వాడి చేనుకు నీళ్ళు పెట్టడు; ఎరువులు వేయడు; నారుమడితో పని లేదు. ఊరిలో వా డొక రౌడీ. షావుకారు అండా ఆపులున్నాయి. కండా కొవ్వులు మెండుగా బలిసినవాడు. అదేమన్నా అంటే ఫలసాయం చేతి కందదు. పంట ఏ వోదెల మీదున్నప్పుడో, ఏ కుప్ప వేసింతర్వాతో - పరశురామప్రీతి అవుతుందనే భయం !

గోపయ్య నిలువుకన్నులతో నిలబడిపోయాడు, చేను గనుం మీద. కొన్ని నిమిషాలపాటు ఆలోచించాడు. తర్వాత గనుంకు ఎక్కడ గండి పెట్టాడో చూసేందుకు చేనుచుట్టూ తిరిగాడు. దక్షిణం పక్క మూలమీద అడుగు వెడల్పున గండి కొట్టివుంది. ఆ గండిగుండా సన్నగా నీళ్ళు పోతున్నాయి. గోపయ్యకు కళ్ళనీళ్ళు తిరిగాయి. ఏమీ చేయలేని తన అశక్తతకు తానే తిట్టుకున్నాడు. ముల్లుగర్రను గనుంమీద గుచ్చి, చేలోకి దిగి, ఆ గండి పూడ్చాడు. అయినా, చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజన మేమిటి ? తన చేలోని వరిమొక్కలన్నీ బావురుమంటూ ఏడుస్తూన్నట్టుగా కనబడ్డాయి. ఆశీర్వాదం చేలో మొక్కలన్నీ కిలకిల నవ్వుతూన్నట్టుగా గోచరించాయి.

చరచరలాడే ఎండలో చేనుచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి, గుడ్లలో కళ్ళనీళ్ళు కుక్కుకొంటూ ఇంటిదారి పట్టాడు

గోపయ్య. నేరుగా మున్సబు ఇంటి కెళ్ళాడు. జరిగిన ఘోరాన్ని పూర్తిగా వివరించాడు. తన అసమర్ధతను వ్యక్తపరిచి, మున్సబు సహాయాన్ని అర్థించాడు.

కుచ్చు మీసాల్లోంచి కిసుక్కున నవ్వి, ఇట్లా అన్నాడు మున్సబు.

"నే నేం చేసేది గోపయ్యా! బలవంతుడిదే రాజ్యంగా ఉంది. ఆశీర్వాదంగాడు బొడ్డుకు మసి రాసుకూర్చున్నాడు. వాడి దగ్గరకు మనం వెళ్ళితే ఆ మసి మనకే అంటుతుంది."

బీదకన్ను బడి బయటి కొచ్చాడు గోపయ్య.

*　　*　　*

ఆ సంవత్సరం గోపయ్య చేలో గాలిపంటే మిగిలింది. కోత కోశాక కొన్ని వోదెలు పక్కచేలోకి నడిచాయి. ఎంత దగ్గరుండి కుప్ప వేయించినా, కొన్ని కుప్పకట్టలు అదేరోజున కుప్ప వేస్తూన్న ఆశీర్వాదం కుప్పలో పడక తప్పలేదు. ఇదంతా తెలిసికూడా గోపయ్య గోళ్ళు గిల్లుకోవడం మినహా ఏమీ చేయలేకపోయాడు.

గోపయ్య ఎకరంన్నర మాగాణి మొత్తానికి పదహారుబస్తాలు ధాన్యమైతే, ఆశీర్వాదం ఎకరం పొలానికి ఇరవై యెనిమిది బస్తాల ధాన్యమైంది. ఆ రాలుబడిని చూసి ఊళ్లోవాళ్ళు అద్భుతమైన ఆశ్చర్యాన్ని పొందారు. మున్సబు సలహాపై, షావుకారుగార్ని సంప్రదించి, కుప్పనూర్పిడి సమయంలో ఆశీర్వాదం పంచాయితీబోర్డు సర్పంచ్‌నీ, పంచాయితీసమితి ప్రెసిడెంటునూ, బి. డి. ఓ. నూ, ఎగ్రికల్చరల్ అసిస్టెంటునూ, సీడ్ స్పెషలిస్టునూ - మరికొంతమంది అధికారులనూ తీసికొచ్చి స్వయంగా తను స్వయంకృషితో పండించిన పంటను చూపె

ట్టాడు. అందరూ మెచ్చుకున్నారు. సమితి మొత్తం ప్రదేశంలో అంత అధికంగా పంట పండించిన రైతు మరొకరు లేకపోవడంతో ఉత్తమ రైతు బహుమతిని ఆ సంవత్సరం ఆశీర్వాదానికి అందజేయడం జరిగింది. ఆ సందర్భంలో ఓ చిన్న సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో పలువురు పెద్దలు ఆశీర్వాదాన్ని ఆకాశాని కెత్తివేశారు. ఆ సభతాలూకు విశేషాలు, ఫోటోలతో సహా పత్రికలలో పడ్డాయి.

ఆశీర్వాదం పండించిన పంటలోని కిటుకు తెల్సిన గోపయ్యా నోరు కదపలేదు.

*   *   *   *

తన చేనుపక్కన చేను ఆశీర్వాదం చేసినంతకాలమూ - తన చేలోని పంట తగ్గిపోతుందనే అభిప్రాయానికి వచ్చాడు గోపయ్య. ఆశీర్వాదం బెడద వొదిలించుకునేందుకు తీవ్రంగా నిశ్చయించుకున్నాడు.

ఆ వేసవిలో ఓ రోజు మధ్యాహ్నం పనిగట్టుకు మున్సబు ఇంటి కెళ్ళాడు గోపయ్య. మండువాలోగిలి నట్టింట్లో పడక కుర్చీలో కూర్చుని చేబ్రోలు పుగాకు చుట్ట కాలుస్తూ తాపీగా ఆలోచిస్తూన్న మున్సబు, గోపయ్యను ఆప్యాయంగా ఆహ్వానించి పక్కనే కూర్చుండబెట్టాడు. "ఏమిటి కబుర్లు గోపయ్యా!" అన్నాడు మున్సబు కుచ్చుమీసాల్ని సవరించుకుంటూ.

"ముంచారగుంట దగ్గర పొలం - ఈ యేడు కూడా ఆశీర్వాదానికే కట్టుబడి కిస్తున్నావా ?" అన్నాడు గోపయ్య.

"వాడు బాగా పండిస్తున్నాడని లోకమంతా చెప్పుకుంటూన్నది. సమితోళ్లు కూడా బహుమాన మిచ్చారు. చేసుకున్నంత కాలం చేసుకుంటాడు. మధ్యలో వాణ్ణి కదిలించడం దేనికి ?

ఏదో పదిబస్తాలు మిగులుతున్నాయి. బీదవాడు; బాగుపడతాడు," అన్నాడు మున్సబు చుట్టదమ్ము లాగుతూ.

గోపయ్యకు గుమ్మకుత్తుకపడింది. మాట్లాడకుండా లేచి వచ్చాడు.

ఆ మరునాడే గోపయ్య ముంచారగుంట దగ్గరున్న ఎకరన్నర చేనూ బేరం పెట్టాడు. బంగారంలాంటి చేనును గోపయ్య పోకడపెట్టడానికి పూనుకోవడం ఊళ్ళో అందరికీ అబ్బురం కలిగించింది. కాని మున్సబూ, మున్సబు మోచేతినీళ్ళు తాగే ఆశీర్వాదమూ రవ్వంత ఆశ్చర్యపడలేదు. పైపెచ్చు గంభీరంగా చిరునవ్వు నవ్వుకున్నారు.

ఆ పొలం కొనడానికి ముందెత్తున నలుగురైదుగురు రైతులు మొగ్గుచూపారు. కాని అందులో కిటుకు తెలుసుకున్నమీదట వెనుకాడారు. ఎకరం అయిదున్నరవేలు చేసి మున్సబే చివరకు కొన్నాడు. గోపయ్యపొలం చవుగ్గా పోయిందని ఊళ్ళోవాళ్ళు వాపోయ్యారేగాని - పై బేరాలకెవ్వరూ ప్రయత్నించలేదు.

గోపయ్యనూ, ఊళ్ళోవాళ్ళనీ మరీ ఆశ్చర్యపర్చిన విషయమేమిటంటే : ఆ మరుసటి సంవత్సరం మున్సబు తన పొలాన్ని ఆశీర్వాదం దగ్గర్నుంచి తీసికొని స్వయంగా నాటు వేయించాడు - కొత్తగా కొన్న గోపయ్య చేనుతోపాటు.

(అన్నదాత)